

# నైజం. బాలం వెంకట్రావు

"ఏవిటో .... మాయదారి రోజులు! అన్ని ధరలూ మండిపోతున్నాయి .... నా రేషన్ కార్డేమో ఇంతదాకా రాలేదు, రాంబాబూ!"

"కొత్త కార్డు ఇంకా రాలేదా, బామ్మగారూ?"

"ఎక్కడి కార్డు నాయనా! మండలాఫీసు చుట్టూ తిరిగి తిరిగి కాళ్లరిగిపోయాయి!"

"అదేమిటీ?"

"ముందు కాగితం పెడితే ఇచ్చేస్తామన్నారు ... తీరా ఇచ్చాకేమో 'మామూలు' అన్నాడు అక్కడి గుమాస్తా. వదో వరకో చేతిలో పెట్టాను. ఎప్పుడిస్తావంటే రివిన్యూ ఇనస్పెక్టరు చూడాలన్నాడు."

"అతనేమన్నాడు?"

"ఏమంటాడు? చూస్తాన్లే .... చేస్తాన్లే ... అంటాడు!"

"అదేమిటీ?..."

"వాడికీ చేతులు తడపాలని ..."

"పోనీ ఎంతో కొంత పడెయ్యకపోయారా?"

"పడేశాను."

"తర్వాత?"

"వాడూ చేతులెత్తేసి నా దగ్గర ఏమీ లేదు. మండలాఫీసర్ని పట్టుకో అన్నాడు!"

"కలిశారా? ఇచ్చేశాడా?"

"వాళ్ల జిమ్మడ! అంత తేలిగ్గా ఇస్తారా? నాకు సర్వేలు, పట్టాల పంపకం పనులున్నాయి. తర్వాత చూస్తాను అన్నాడు!"

"ఆయనక్కూడా ఆశ ఉందేమో మరి ...!"

"అదే తెలుసుకున్నాను. బంట్రోతు చెప్పాడు!"

"మరి ఇచ్చారా?"

"ఇద్దామంటే అయివు లేదు. పైగా రేటు వందలమీదేనట!"

"ఛ! ఎంత అసహ్యంగా ఉంది!"

"అసహ్యమా .... పరమ అసహ్యమా! పేదల్ని పీల్చుకు తింటున్నారు ముదనష్టపోళ్లు! మా ఉసురు వాళ్లకి తగులుతుంది!"

"పాపం, చాలా అవస్థలు పడ్డారు బామ్మగారూ!"

"పోనీలే, నాయనా! అది అయ్యేటప్పుడే అవుతుంది. నీ ప్రయత్నాలు ఎంతదాకా వచ్చాయి? ఎందులో అయినా దొరికిందా?"

"లేదు, బామ్మగారూ! ప్రయత్నిస్తున్నాను!"

"అన్నీ గగనమైపోతున్నాయి. చదువు ఉండి కూడా చేయటానికి ఉద్యోగం దొరకటం లేదు!"

రాంబాబు గాఢంగా నిట్టూర్చాడు.

బామ్మగారు గదిలోకి వెళ్లిపోయింది.

***

ఒకరోజు రాంబాబు పరుగెత్తుకుంటూ వచ్చాడు, బామ్మగారి వద్దకు మిఠాయి పొట్లంతో.

"నాకు ఉద్యోగం వచ్చింది, బామ్మగారూ!"

"ఆహాఁ! అలాగా ... ఎందులో నాయనా?"

"కలెక్టరాఫీసులో ... గుమాస్తా!"

"అయితే మంచి ఉజ్జోగమేనన్నమాట!"

"మంచిదే బామ్మగారూ! కలెక్టరేట్ కదా! జిల్లా కేంద్రంలో ఉండొచ్చు!"

"పోనీలే, నాయనా! చాన్నాళ్లకి జీవితంలో స్థిరపడ్డావు!" ఉత్సాహంగా అని, అతని దగ్గరగా వెళ్లి ముఖంలో ముఖం పెట్టి ఇలా అంది బామ్మగారు, నెమ్మదిగా

"ఏమైనా 'పైన' దొరుకుతాయా?"

అవాక్కయిపోయాడు రాంబాబు.

'రామ ... రామ!' అనుకున్నాడు మనసులో. ■